క్లుప్తంగా

చేదోడు లబ్ధిదారుల వివరాలు పరిశీలన



దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వై.పద్మజ

కొత్తవలస: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన జగనన్న చేదోడు పథకం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీఓ వై.పద్మజ పరిశీలించారు. కొత్తవలస మేజర్ పంచాయతీ ఒకటో సచివాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత ఏడాది జగనన్న చేదోడు పథకం ద్వారా 657 మందికి లబ్ధి చేకూరిందన్నారు. ఈ ఏడాది 427 మంది దరఖాస్తులను రెన్యువల్ చేశామని, మిగిలిన లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా 50 మందిని లబ్ధిదారులుగా గుర్తించామన్నారు. ఆమె వెంట ఈఓ కన్నబాబు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గోపుర పూజ



ఆలయ శిఖరంపై పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని బి.రాజేరు గ్రామంలో శ్రీదుర్గా మల్లేశ్వర సమేత గణపతి సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ గోపురంపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోపురంపై ధాన్యం, బూరెలు వేసి పూజలు చేశారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

గజపతినగరం: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ న్యాయవాదులు నిరసన తెలియజేశారు. గజపతినగరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసులనాయుడు ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం తమ విధులను బహిష్కరించారు. కాకినాడలో మహిళా న్యాయవాది అన్నపూర్ణ వ్యక్తిగత పనిపై శ్రీకాకుళం జిల్లా వంజంగి గ్రామానికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి ఆమెపై దాడికి పాల్పడటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, దాడికి పాల్పడిన వారికి గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై ప్రమాదకరంగా వ్యర్థాలు



రోడ్డుకు ఇరువైపులా పారబోసిన వ్యర్థాలు

కొత్తవలస: కొత్తవలస-విజయనగరం రోడ్డులో చింతలదిమ్మ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలను డంప్ చేస్తుండడంతో స్థానికులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమీప గ్రామాల నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా వ్యర్థాలు రోడ్డుకు ఇరువైపులా సుమారు కిలో మీటర్ పొడవున డంప్ చేస్తున్నారు. దీంతో నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలను డంప్ చేయకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న రేలారే రేలా



పాటలు పాడుతున్న కళాకారులు

వేపాడ: మండలంలో బల్లంకి గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి తీర్థం వైభవంగా జరుగుతోంది. రెండో రోజు శుక్రవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన రేలారే రేలా కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శనివారం సాయంత్రం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్టీసీలో రోడ్డు భద్రత వారోత్సవాలు

శృంగవరపుకోట: మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు సంభవిస్తాయని, ప్రమాదాల నివారణకు నిత్యం జాగరూకులై ఉండాలని ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో రహదారి భద్రత వారోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై ప్రయాణికులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

జగనన్న ప్రభుత్వంలో..
అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



ధర్మవరంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా.. అర్హతే ప్రమాణికంగా.. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గతంలో పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వచ్చి చేరుతున్నాయన్నారు. ఎక్కడైనా సమ్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పినిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ డోల కనకమహాలక్ష్మి, గ(ట్రెడ్డి పైడితల్లి, అల్లు మహాలక్ష్మినాయుడు, అట్టు కిట్టుబాబు, పోతనాపల్లి, వెంకటరమణపేట, చామలాపల్లి సర్పంచ్‌లు కె.వెంకటరావు, రామకోటి, జుత్తాడ సూర్యారావు, పుణ్యగిరి ట్రస్ట్ చైర్మన్ పి.రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ పార్వతి, ఎంపీటీసీ పి.ధర్మారావు, షేక్ రహ్మాన్, పి.జగదీష్, మోపాడ కోటి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



చీపురుపల్లి రూరల్: టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ



బొండపల్లి: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు అర్హత సాధించినట్లు పీడీ యు.ఎస్. సత్యానంద్, హెచ్ఎం శ్రీరామాచారి తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-17 బాలబాలికల విభాగంలో పాఠశాల నుంచి బి.హరికుమార్, కోరాడ వర్మ, కోరాడ శ్రీను, పొట్నూరు యమున, కొండ్రు దీపిక, బూడి భాగ్యశ్రీలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హుల సాధించారు. వీరు ఈ నెల 29,30 తేదీల్లో బాపట్లలో జరిగే పోటీల్లో పాల్గోనున్నారు.

టెన్నీకాయిట్ పోటీలకు పెదనడిపల్లి విద్యార్థులు

చీపురుపల్లి రూరల్: మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఎం.గుణశేఖర్, ఎం.కావ్య, జి.హైమావతి, జి.ప్రసన్న ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారిని పాఠశాల హెచ్‌శ్రీం ఎస్.కె.రహెనాబేగం, వ్యాయామోపాధ్యాయుడు ఎం.రామారావు, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. వీరు ఈ నెల 28 నుంచి 30 వరకు ఎన్‌టీఆర్ జిల్లా కోడూరులో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు.

కలశాల ఊరేగింపు



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

గజపతినగరం: పట్టణంలోని శ్రీపైడితల్లి అమ్మవారి ఆలయ శిఖర ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం కలశ ప్రదర్శన చేపట్టారు. స్థానిక శ్రీరామదూత సేవాసంఘం ఆధ్వర్యంలో మహిళలు తలపై కలశాలు ధరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వాటిని సమర్పించి మొక్కులు చెల్లించారు. శనివారం ఆలయ శిఖర ప్రతిష్ట, ఆదివారం అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే



ఎస్.కోటలో సమావేశమైన ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

శృంగవరపుకోట: థామస్ అల్వా ఎడిసన్ బల్బును కనిపెట్టిన రోజును పురస్కరించుకుని పట్టణానికి చెందిన ఎలక్ట్రీషియన్స్ ఎండ్ ప్లంబర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎలక్ట్రీషియన్ డేని నిర్వహించారు. స్థానిక గాంధీ పార్కు ఆవరణంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించాలని, ఒకే తరహా సర్వీసుకు ఒకే విధంగా సర్వీసు ఛార్జీలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్ సింహాచలంనాయుడు, డి.రాజు, ఆనంద్, కె.అప్పారావు, చిన్న, కోటి, అవతారం, ఎం.బాలు, సంతోష్, సునీల్, ఎలక్ట్రికల్ దుకాణాల యజమానులు, వర్కర్లు పాల్గొన్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గార తవుడు

గజపతినగరం: సొంత స్థలం కలిగి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరైన హౌసింగ్ లబ్ధిదారులకు తక్షణమే బిల్లులు మంజూరు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2022-23వ సంవత్సరంలో ఇళ్ల స్థలాలకు మంజూరైన బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూడాల్సిన బాధ్యత హౌసింగ్ అధికారులదేనని అన్నారు. పొజిషన్ సర్టిఫికెట్ ఉన్నవారికి బిల్లులు చెల్లిస్తే వారంతా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.అరుణకుమారి, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, సీనియర్ నాయకుడు బెల్లాన త్రినాథరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు, హౌసింగ్ డీఈ ఎన్.జి.రత్నాకర్, ఏఈ బి.వి.రమణ పాల్గొన్నారు.

డీవీఈఓ విచారణ

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న టి.వెంకటరావు గతకొన్నేళ్లుగా నకిలీ సర్టిఫికెట్లతో విధులు నిర్వర్తిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో డీవీఈఓ ఆర్.సురేష్‌కుమార్ శుక్రవారం కళాశాలలో విచారణ చేపట్టారు. అధ్యాపకుల నుంచి ప్రాథమిక వివరాలు సేకరించారు. పూర్తి విచారణ అనంతరం వాస్తవాలు తెలియజేస్తామన్నారు.

ఘనంగా పరదేశమ్మ తీర్థం

లక్కవరపుకోట: మండలంలోని భీమాళి గ్రామంలో పరదేశమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతలకు సర్పంచ్ కొయ్యాన కృష్ణ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేటి నుంచి వేపాడలో..

వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో గ్రామదేవతలు పరదేశమ్మ, ముత్యాలమ్మ అమ్మవారి తీర్థం శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రెండురోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శనివారం క్విజ్ పోటీలు, జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు, కుండల పోటీలు, ద్విచక్ర వాహనం స్లో రైడింగ్ పోటీలు, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 29న ఎడ్లు పరుగు ప్రదర్శన ఉంటుందన్నారు.

నేడు రథసప్తమి వేడుకలు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో వెలసిన సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త ఎస్.వి.రమణరాజు ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు ఘనంగా చేశారు. శనివారం వేకువజామున 4 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు స్వామివారి నిజరూప దర్శనానికి అవకాశం కల్పిస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజపతినగరం: మండల న్యాయసేవా కేంద్రం ఆధ్వర్యంలో పారాలీగల్ వలంటీర్లుగా పని చేసేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘ సభ్యులు, సీనియర్ సిటిజన్‌లు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 31లోగా మండల న్యాయ సేవా కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

గజపతినగరం: పురిటిపెంట గ్రామానికి చెందిన పడాల రవికుమార్, సునీత దంపతుల కుమార్తె పడాల వాత్సల్య పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని పాఠశాలకు రూ.20 వేలు విలువ చేసే ఒక టేబుల్, మూడు కుర్చీలను వితరణ చేశారు. హెచ్ఎం సింహాచలంకు శుక్రవారం వీటిని అందజేశారు. మాదిక్షగా పుట్టినరోజున పాఠశాలకు ఉపయోగపడే సామగ్రిని వితరణ చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు కె.చంద్రశేఖర్, ఎం.శంకరరావు, దేవుడు తదితరులు వాత్సల్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

చీపురుపల్లి రూరల్: పుస్తక పఠనంతో విజ్ఞానం, ఏకాగ్రత పెరుగుతుందని ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో మొబైల్ బైక్ లైబ్రరీ ద్వారా విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువత మొబైల్ లైబ్రరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు దేశ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.

రైతుల సమక్షంలోనే భూసర్వే చేపట్టాలి

● జేసీ మయూర్ అశోక్



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న జేసీ అశోక్

చీపురుపల్లి రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వేని రైతుల సమక్షంలోనే చేపట్టాలని జాయింట్ కలెక్టర్ (గృహనిర్మాణ శాఖ) మయూర్ అశోక్ అన్నారు. మండలంలోని పుర్రేయవలస, అలజంగి గ్రామాల్లో జరుగుతున్న భూసర్వేని శుక్రవారం ఆయన పరిశీలించారు. సర్వే ఎలా జరుగుతుందని రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే చేపట్టాలని సూచించారు. రైతులకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. సర్వే పూర్తయిన తర్వాత రైతులకు భూహక్కు పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఆర్డీఓ అప్పారావు, తహసీల్దార్ ఎం.సురేష్ ఉన్నారు.

అమ్మవారి ఘటాలకు ఎమ్మెల్యే పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో బంగారమ్మతల్లి గుడి పునఃప్రతిష్టా కార్యక్రమంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య శుక్రవారం పాల్గొన్నారు. సర్పంచ్ బేత శ్రీదేవి, రవి దంపతులు ఆయనకు స్వాగతం పలికారు. వేదపండితులు సంతోష్‌కుమార్ శర్మ ఎమ్మెల్యేతో అమ్మవారి ఘటాలకు పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. శనివారం రథసప్తమి సందర్భంగా గుడి గోపురంపై పూర్ణకలశాన్ని ప్రతిష్టించనున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఉంటుందని సర్పంచ్ దంపతులు తెలిపారు.

30 నుంచి రామాలయ ప్రతిష్టా కార్యక్రమాలు

దత్తిరాజేరు: ఆర్.రామచంద్రాపురంలో ఈనెల 30 నుంచి రామాలయ ప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో తొలి రోజు యాగశాల ప్రవేశం, లఘువాస్తు హోమం, ప్రధాన దేవతా ఆవాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

సంక్షిప్తంగా...

పక్కాగా జగనన్న గోరుముద్ద



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీపడేది లేదని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ ఎ.వేదవతి ఆదేశించారు. మండలంలోని గొట్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనాలు ఎలా ఉంటున్నాయని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు సురక్షిత తాగునీరు అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట హెచ్ఎం శ్రీరామాచారి ఉన్నారు.

హెల్మెట్ ధరించండి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

జామి: వాహన చోదకులు హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణాలు సాగించాలని ఏఎస్సై నర్సింగరావు కోరారు. భీమసింగి జంక్షన్ వద్ద హెచ్‌సీలు ఈశ్వరరావు, శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బందితో కలిసి శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత నిబంధనలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల ప్రమాదాలకు గురికావడంతో పాటు మీ కుటుంబాన్ని వీధిన పడేసినవారవుతారన్నారు.

జంతు సంరక్షణ బాధ్యత అందరిదీ



అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ శారద

చీపురుపల్లి: జంతువులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్.శారద అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీసత్యరామ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుషులతో పాటు జంతువులకు కూడా స్వేచ్ఛగా జీవించే హక్కు ఉంటుందన్నారు. అందుకోసం ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. జంతువులను హింసించినా, వాటి మరణానికి కారణమైనా చట్ట ప్రకారం శిక్షార్హులుగా పేర్కొన్నారు. అనంతరం జంతు సంక్షేమంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వ్యాకులమాత యాత్ర ప్రారంభం



దివ్యబలి పూజలో పాల్గొన్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్

కొత్తవలస రూరల్: వ్యాకులమాత పుణ్యక్షేత్ర యాత్రా శుక్రవారం ప్రారంభమైంది. ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ పతాక ఆవిష్కరణ చేసి యాత్ర ప్రారంభించారు. మొదటి రోజు పరిశుద్ధ దివ్య బలి పూజ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫాదర్ మర్యదాసు, ఫాదర్ షింటో తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

శృంగవరపుకోట: శివరాత్రి జాతర ఏర్పాట్లపై చర్చించేందుకు పుణ్యగిరి ట్రస్ట్ బోర్డు చైర్మన్ పి.రామకృష్ణ నేతృత్వంలో ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక దారగంగమ్మ ఆలయ ప్రాంగణంలో సమావేశమయ్యారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని, మరుగుదొడ్లు, స్నానపుగదులు, పుట్టుదార వద్ద స్నానాలు చేసేవారి కోసం షవర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 5న నిర్వహించే శివపార్వతుల కల్యాణోత్సవం ఏర్పాట్లపై సమీక్షించారు. సమావేశంలో ఈఓ నాగేంద్ర, డైరెక్టర్లు సత్యసాయి, కె.శ్రీనివాసరావు, శ్రీరామ్మూర్తి, వై.ఈశ్వరరావు, అర్చకులు రాజగోపాలాచార్యులు, మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.